మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
సోమవారం 13 ఏప్రిల్ 2026 పేజీ : 1

# ఈసారీ బాలికలదే పైచేయి!

- తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల
- సెకండియర్‌లో 75.34% ఉత్తీర్ణత..
- నెల రోజుల్లోనే సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 12 (మనసులో మాట):** తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాలు 2026 విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ, ముఖ్యమంత్రి తరఫున పాసైన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫలితాల్లో బాలికలు గణనీయమైన పైచేయి సాధించారు. రెండవ సంవత్సరం జనరల్ విభాగంలో 75.61% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్ విభాగంలో 72.71% మంది పాసయ్యారు. రెండు విభాగాలను కలిపి రెండవ సంవత్సరం మొత్తం ఉత్తీర్ణతా శాతం 75.34% గా నమోదైంది, ఇది గత సంవత్సరం కంటే ఎక్కువ. మొదటి సంవత్సరంలో జనరల్ విభాగంలో 66.94%, ఒకేషనల్ విభాగంలో 59.30% మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద మొదటి సంవత్సరం 66.20% మంది విద్యార్థులు పాసయ్యారు. ఉత్తీర్ణులు కాని విద్యార్థుల కోసం నెల రోజుల్లోనే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

03

# భేషజాలు లేకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధి

- సిద్దిపేటలో హరీశ్ రావు ఉన్నా పరిశ్రమలు స్థాపిస్తున్నాం
- స్థానిక నాయకులు ప్రజలు సహకరించాలి
- డిసెంబర్ లోపు ప్రాజెక్ట్ పూర్తి కావాలి
- యువతకు ఉపాధి దొరకాలి
- పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు

**సిద్దిపేట, ఏప్రిల్ 12 (మనసులో మాట):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో 20 ఎకరాల్లో రూ.210 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఆదివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పరిశ్రమలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. నర్మేట ప్రాంతంలోని వనరులపై పలు సార్లు చర్చలు జరిపి ఈ పరిశ్రమకు రూపకల్పన చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. బయో ఫ్యూయల్స్ ప్రాముఖ్యత పెరుగుతోందని, గడ్డి వంటి వనరులతో ఇంధనం తయారు చేయవచ్చని వివరించారు.

వివరాలు 2లో..





## మందు బాటిళ్లు పంపించు..

### కేసు టేకప్ చేస్తా!

### మీర్‌పేట్ ఎస్సై నిర్వాకం

డబ్బుల కోసం బాధితుడికి వేధింపులు..

ఎస్సై నాగభూషణంను హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసిన సీపీ

2



## 'ధురంధర్ 2' అద్భుతం

- ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసల జల్లు
- దేశభక్తిని చాటిచెప్పే చిత్రమని కొనియాడారు

3

## బేగంపేట యాక్సిస్ బ్యాంక్‌లో భారీ మోసం

### ఎన్ఆర్ఐ ఖాతా నుంచి రూ. 6.5 కోట్లు కొట్టేసిన వైనం..

వివరాలు 3లో..



04

## కాళేశ్వరం పునరుద్ధరణపై సర్కార్ వేగం

### 2028 నాటికి బ్యారేజీల పనులు పూర్తి!

ఐఐటీ ముంబైకి డిజైన్ల బాధ్యత.. వారానికి రెండుసార్లు రివ్యూ

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## పేరు మార్పుతో నష్టపోయాం..

### తెలంగాణ సెంటిమెంట్‌కు దూరమయ్యామని అంగీకారం

### తిరిగి టీఆర్ఎస్‌గా మారనున్న బీఆర్ఎస్?

ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు!



2



# పేరు మార్పుతో నష్టపోయాం..

## కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు!

**మంచిర్యాల, ఏప్రిల్ 12 (మనసులో మాట):** భారత్ రాష్ట్ర సమితి పేరును తిరిగి తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చే అంశంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ, పార్టీ పేరు మార్పు వల్ల రాజకీయంగా కొంత నష్టం వాటిల్లిందనే సత్యాన్ని బహిరంగంగా అంగీకరించారు. "బీఆర్ఎస్‌గా మారిన తర్వాత తెలంగాణ సెంటిమెంట్‌కు, ప్రజల ఆకాంక్షలకు కొంత దూరం అయ్యామని మేము భావిస్తున్నాం. మళ్లీ టీఆర్ఎస్‌గా మారాలని కార్యకర్తలు, క్షేత్రస్థాయి నేతల నుంచి మాపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. వ్యక్తిగతంగా నేను కూడా పార్టీ పేరు తిరిగి టీఆర్ఎస్‌గా ఉంటేనే బాగుంటుందని కోరుకుంటున్నాను" అని కేటీఆర్ తన మనసులోని మాటను బయటపెట్టారు. అయితే, పేరు మార్పు అనేది సాధారణ విషయం కాదని, దీనిపై పార్టీ అధినేత కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటారని కేటీఆర్ స్పష్టం చేశారు. త్వరలోనే ఈ విషయంలో ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు చేసిన కొన్ని పొరపాట్లను సరిదిద్దుకుని మళ్లీ ప్రజల్లోకి వెళ్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. "తెలంగాణ అస్తిత్వమే మా పార్టీకి పునాది. రాబోయే ఎన్నికల నాటికి పార్టీని పూర్తిస్థాయిలో సమాయత్తం చేస్తాం. అస్తిత్వమే జెండాగా మా ప్రయాణం సాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి.

# భేషజాలు లేకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధి

## సిద్దిపేటలో హరీశ్ రావు ఉన్నా పరిశ్రమలు స్థాపిస్తున్నాం

## స్థానిక నాయకులు ప్రజలు సహకరించాలి

## డిసెంబర్ లోపు ప్రాజెక్ట్ పూర్తి కావాలి

## యువతకు ఉపాధి దొరకాలి

## పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు



**సిద్దిపేట, ఏప్రిల్ 12 (మనసులో మాట):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో 20 ఎకరాల్లో రూ.210 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పరిశ్రమలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. నర్మేట ప్రాంతంలోని వనరులపై పలు సార్లు చర్చలు జరిపి ఈ పరిశ్రమకు రూపకల్పన చేశామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. బయో ఫ్యూయల్స్ ప్రాముఖ్యత పెరుగుతోందని, గడ్డి వంటి వనరులతో ఇంధనం తయారు చేయవచ్చని వివరించారు. పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి కలిగి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అన్నారు. 2047 నాటికి తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని చెప్పారు. కాలుష్యం లేని పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశం 90శాతం వరకు ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోందని, ఇందులో 65శాతం వంట గ్యాస్ ఇతర దేశాలపై ఆధారపడుతోందని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధాల ప్రభావం వల్ల లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్పిజి) సరఫరాపై కూడా ప్రభావం పడుతోందని సూచించారు. "మేక్ ఇన్ ఇండియా" తరహాలో "మేక్ ఇన్ తెలంగాణ" లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి వెల్లడించారు. నర్మేటలో ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీలో డిసెంబర్ లోపు గ్యాస్ ఉత్పత్తి కావాలని అన్నారు. ఇక్కడి ఫలితాలు అనుభవించాలని సూచించారు. సిద్దిపేట హరీశ్ రావు ప్రాంతం అయినా పరిశ్రమ తెచ్చామని తమకు ఎలాంటి బెషజాలు లేవని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు బాగుపడాలనేది సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం అన్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్లే సిద్దిపేటకు పరిశ్రమలు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ ఇలాంటి పరిశ్రమ సిద్దిపేటకు రావడం ఆనందంగా ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. పరిశ్రమల అభివృద్ధి కోసం ఇప్పటికే 2014-15 సంవత్సరాల్లో భూ సేకరణ చేపట్టామని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, నీటి లభ్యత పెరగడంతో పరిశ్రమలు స్థాపనకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ వంటి పరిశ్రమలను ప్రారంభించామని, మరిన్ని ఇండస్ట్రీలు రావడానికి ఇదే కారణమని తెలిపారు. ఇంతకు ముందు నీటి కొరత కారణంగా వరి పంటలు పండించలేక పోయేవారని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. రైతులకు ధాన్యంతో పాటు గడ్డి (ఫోడ్డర్) ద్వారా కూడా ఆదాయం వస్తోందని చెప్పారు. బయో గ్యాస్ ప్లాంట్ల అభివృద్ధి ద్వారా సుమారు 500 మందికి ఉపాధి కలుగు తోందని, రైతులకు కూడా అదనపు ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయని వెల్లడించారు. ప్రజలందరూ సహకరించాలని, రాజకీయాలకు అతీతంగా మరిన్ని పరిశ్రమలు తీసుకురావడానికి ప్రయత్నించాలన్నారు. ప్రజలు మంచిగా ఉంటేనే పరిశ్రమలు వస్తాయని అన్నారు. అంతర్జాతీయ పరిస్థితులపై కూడా స్పందించిన హరీష్ రావు, అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం భారత్ సుమారు 50శాతం గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటోందని, యుద్ధ పరిస్థితుల వల్ల గ్యాస్ కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి బయో గ్యాస్ ప్లాంట్ల వల్ల ఆ సమస్యలను తగ్గించుకోవచ్చని, దిగుమతులను తగ్గించి స్వయం సమృద్ధి సాధించవచ్చని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు.

# మందు బాటిళ్లు పంపించు..

# కేసు టేకప్ చేస్తా!

## మీర్‌పేట్ ఎస్సై నిర్వాకం

**మీర్‌పేట్, ఏప్రిల్ 12 (మనసులో మాట):** కేసు పరిష్కారం కావాలా వద్దా..? అయితే ముందు మందు బాటిళ్లు పంపించు.. ఆ తర్వాత డబ్బు అరేంజ్ చెయ్.. ఇవి ఆ ఎస్సై బాధితులతో ఆడే బేరసారాలు. డిమాండ్ చేసినంత ఇవ్వకుంటే కేసును నీరుగార్చడం, ఆలస్యం చేయడం.. అవసరమైతే ఫిర్యాదు చేసినవాళ్లనే ఇబ్బందులకు గురిచేయడం రండారెడ్డి జిల్లా మీర్‌పేట్ ఎస్సై స్పెషల్. విసుగు చెందిన బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో సస్పెన్షన్ కు గురయ్యాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మీర్ పేట్ పరిధిలోని లెనిన్ నగర్ లో తన స్థలాన్ని కబ్జా చేశారని తిరుపతయ్య అనే వ్యక్తి కంప్లైంట్ ఇచ్చాడు. ఎస్సై నాగభూషణం బాధితునికి న్యాయం చేయకపోగా.. తననే డబ్బులు డిమాండ్ చేస్తూ మద్యం బాటిల్ పంపించాలంటూ వేధించాడు. మీర్‌పేట్ సీఐ శంకర్ నాయక్ బాటలోనే ఎస్సైలు నడుస్తున్నారంటూ బాధితులు




ఆరోపిస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్సై నాగభూషణంపై అధికారులు చర్యలు చేపట్టారు. సజ్జనార్ ఆదేశాల మేరకు ఎస్సై నాగభూషణాన్ని ఆదివారం (2026 ఏప్రిల్ 12) హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించేందుకు శంషాబాద్ డీసీపీ రాజేష్ కు రెండు రోజుల గడువు విధిస్తూ, సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నివేదిక అందిన తర్వాత ఎస్సైపై తగిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

# పంట మార్పిడి చేయమంటాడు..

# చేస్తే వాటిని కొనడు..

## సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం

**సిద్దిపేట, ఏప్రిల్ 12 (మనసులో మాట):** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రైతుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుననదని.. పంట కొనుగోలులో నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను హరీశ్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. పంట కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్లను ప్రారంభించలేదని.. వెంటనే కొనుగోలు సెంటర్లను ప్రారంభించి, మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ఘులను అధికారులు సందర్శించాలని సూచించారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్లను ప్రారంభించకపోవడంతో రైతులు తక్కువ ధరకు పంటను అమ్ముకుని నష్టపోతున్నారని హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం అని అన్నారు. పలు జిల్లాలలో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలన్నారు.



# ‘ధురంధర్ 2’ అద్భుతం..

- ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- దర్శకుడు ఆదిత్య ధర్‌పై ప్రశంసల జల్లు..
- దేశభక్తిని చాటిచెప్పే చిత్రమని కొనియాడారు



**హైదరాబాద్, ఏప్రిల్ 12 (మనసులో మాట):** ఇటీవల బాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న ‘ధురంధర్ 2’ సినిమాను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సినిమా అత్యద్భుతంగా ఉందని, దేశ రక్షణ కోసం మన భద్రతా దళాలు చేస్తున్న త్యాగాలను ఈ చిత్రం కళ్లకు కట్టినట్లు చూపించిందని కొనియాడారు. సినిమా దర్శకుడు ఆదిత్య ధర్‌పై మంత్రి ప్రశంసలు కురిపించారు. “ఆదిత్య చాలా అద్భుతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సినిమా అంటే కేవలం వినోదమే కాదు, ఒక సామాజిక బాధ్యత కూడా అనిపించేలా ‘ధురంధర్ 2’ను తీర్చిదిద్దారు” అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి భారతదేశంపై పాకిస్థాన్ చేస్తున్న కుట్రలను, దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు సాగిస్తున్న విచ్ఛిన్నకర ప్రయత్నాలను సినిమాలో చక్కగా చూపించారని మంత్రి అన్నారు. దేశంలోకి దొంగ నోట్లను చొప్పించడం వంటి అంశాలను కూడా స్పృశించారని తెలిపారు. భారత భూభాగంలో ఒక ప్రాంతాన్ని విడదీసి పాకిస్థాన్ అనే శత్రువును తయారు చేసి పెట్టారని, భవిష్యత్తులో కూడా ఆ దేశం కుట్రలు చేస్తూనే ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ‘నయా భారత్’ ఏ విధంగా రూపొందుతోందో మనం చూస్తున్నామని మంత్రి అన్నారు. ఆపరేషన్ సిందూర్, సర్జికల్ స్ట్రైక్స్ వంటి కార్యక్రమాలతో శత్రువుల దుశ్చర్యలను భారత్ ఎలా తిప్పికొట్టిందో సినిమాలో గొప్పగా ఆవిష్కరించారని కొనియాడారు. “సినిమాలో నటీనటులు నటించలేదు.. జీవించారు. దేశ రక్షణ కోసం మన భద్రతా బలగాలు చేస్తున్న సాహసాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అన్ని వర్గాల ప్రజలు దేశ భద్రత కోసం అండగా నిలబడాలి” అని మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.



## కాళేశ్వరం పునరుద్ధరణపై సర్కార్ వేగం

**2028 నాటికి బ్యారేజీల పనులు పూర్తి!**

**ఐఐటీ ముంబైకి డిజైన్ల బాధ్యత..**

**వారానికి రెండుసార్లు రివ్యూ**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 12:** కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులపై తమ ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ సచివాలయంలో కాళేశ్వరం బ్యారేజీలపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. బ్యారేజీల్లో తీవ్రమైన లోపాలను ఎన్డీఎస్ఏ అధికారులు గుర్తించారని తెలిపారు. 2027 నుంచి 2028 వరకు బ్యారేజీల పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఏఎఫ్ఆర్ వై ఇండియా -- ఐఐటీ ముంబైకి డిజైన్ బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు అత్యున్నత ప్రాధాన్యమని.. 45 రోజుల పరీక్షలు ఉంటాయని తెలిపారు. స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తామని.. వారానికి రెండుసార్లు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎల్ అండ్ టీ సహ సంస్థలకు క్యాంపులు రీ యాక్టివేట్ చేయాలని ఆదేశించారు. అన్ని పరీక్షలు సంయుక్తంగా నిర్వహించాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలు చేశారు.

## ప్రజారక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం

**డీజీపీ శివధర్ రెడ్డి**



మంచిర్యాల/కన్నెపల్లి, ఏప్రిల్ 12 (మనసులో మాట): ప్రజల రక్షణ, భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ అహర్నిశలు కృషి చేస్తోందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఆయన ఘనంగా ప్రారంభించారు. మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ అంబర్ కిషోర్ ఝా తదితర అధికారులతో కలిసి డీజీపీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మొక్కలు నాటి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువలో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని, సాంకేతికతను వినియోగించి భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ మరియు ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బెల్లంపల్లిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ‘అరైవ్ - అలైవ్’ కార్యక్రమంలో భాగంగా ఆటో, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. సామాన్యుడి నుండి ముఖ్యమంత్రి వరకు చట్టం ఒక్కటేనని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను ఎడమవైపు నుంచి ఓవర్ టేక్ చేయవద్దని సూచించారు. ఒక రోడ్డు ప్రమాదం కుటుంబం మొత్తాన్ని రోడ్డుపై పడేస్తుందని, వాహనదారులు బాధ్యతగా మెలగాలని డీజీపీ కోరారు. అనంతరం ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు బీమా చెక్కులను అందజేశారు. హెడ్ క్వార్టర్స్‌లోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.




## బేగంపేట యాక్సిస్ బ్యాంక్‌లో భారీ మోసం

**ఎన్ఆర్ఐ ఖాతా నుంచి రూ. 6.5 కోట్లు కొట్టేసిన వైనం..**

**41 విడతల్లో సొమ్ము మళ్లింపు.. మేనేజర్ అరెస్ట్**

**హైదరాబాద్, ఏప్రిల్ 12 (మనసులో మాట):** నగరంలోని బేగంపేట యాక్సిస్ బ్యాంక్ బ్రాంచ్‌లో భారీ ఆర్థిక మోసం వెలుగుచూసింది. ఒక ఎన్ఆర్ఐ వినియోగదారుడి ఖాతా నుండి ఏకంగా రూ. 6.5 కోట్లు కాజేసిన ఆరోపణలపై బ్యాంక్ మేనేజర్ వెంకట రమణను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. అత్యంత పకడ్బందీగా జరిగిన ఈ ఘరానా మోసం బ్యాంకింగ్ వర్గాల్లో కలకలం రేపుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. బాధితుడైన ఎన్ఆర్ఐ సంతకాన్ని ఫోర్జరీ చేసిన మేనేజర్ వెంకట రమణ, ఏకంగా 41 విడతల్లో రూ. 6.5 కోట్లను ఇతర ఖాతాలకు మళ్లించాడు. కేవలం డబ్బు మళ్లించడమే కాకుండా, బాధితుడి అనుమతి లేకుండానే సదరు బ్యాంక్ ఖాతాను క్లోజ్ చేయడం గమనార్హం. దీనిపై బాధితుడు గతంలోనే బ్యాంక్ సీఈవో దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో, 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ భారీ కుంభకోణంలో కేవలం మేనేజర్ ఒక్కరే కాకుండా, బ్రాంచ్‌కు చెందిన సీనియర్ అధికారులు, ఆపరేషన్స్ టీమ్ ప్రమేయం కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన ఖాతానే కాకుండా, బ్యాంక్‌లోని మరికొంత మంది ఇతర ఖాతాదారుల నగదు కూడా ఇదే తరహాలో మాయమైనట్లు బాధితుడు ఆరోపిస్తున్నారు. కేసు నమోదైనప్పటి నుండి మేనేజర్ వెంకట రమణ విచారణకు సహకరించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. పక్కా సమాచారంతో పోలీసులు తాజాగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ స్కామ్ వెనుక ఉన్న మరికొందరి వివరాల కోసం పోలీసులు లోతైన విచారణ ప్రారంభించారు. బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి ఫోరెన్సిక్ ఆడిట్ కూడా నిర్వహించనున్నట్లు సమాచారం.


## మల్లన్న జాతరలో జగ్గారెడ్డి నిర్మలారెడ్డి

**సంగారెడ్డి:** గొల్లగూడెం గ్రామంలో నిర్వహించిన మల్లన్న జాతర కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే టిజిఐఐసి చైర్మన్ నిర్మలమ్మ , మున్సిపల్ చైర్మన్ వనిత సంతోష్ , కౌన్సిలర్ శ్రీశైలం తదితరులు హాజరై జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి జాతర సందడిని ఆస్వాదించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని, భక్తుల రద్దీతో జాతర ఉత్సాహంగా కొనసాగింది.



# మక్కల కొనుగోలులో భారీ అవినీతి

- కాంగ్రెస్ నేత వెంకట్రామ్ రెడ్డి ఆరోపణ



**కామారెడ్డి, ఏప్రిల్ 12:** కామారెడ్డి జిల్లాతాడ్వాయి మండలంలోని మక్కల కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సొసైటీ సిబ్బంది అడ్డగోలు అవినీతికి పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. ఆదివారం తాడ్వాయి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాడ్వాయి మండలంలో రెండో విడత కొనుగోలు కేంద్రాన్ని తీసుకువస్తే, తనపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. రైతుల అభ్యర్థన మేరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం తాను 20 రోజుల పాటు అధికారుల చుట్టూ తిరిగానని,ఆ సమయంలో అయిన రవాణా ఖర్చు రైతుల ఆమోదంతోనే రూ. 50 వేలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.కేంద్రం ఏర్పాటు వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందని ఆయన గుర్తు చేశారు. సొసైటీ సిబ్బంది తీరుపై వెంకట్రామిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మక్కల కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ. 70 చొప్పున మొత్తం రూ. 12,88,200 రైతుల నుంచి సేకరించారని తెలిపారు. లారీలు ఆపారనే నెపంతో రూ. 1,53,000 కాజేశారని సిబ్బందే స్వయంగా ఒప్పుకున్నారు్లు తెలిపారు. లోడ్ అయిన మూడు లారీలు ఆగిపోయాయని చెప్పి రైతుల నుంచి మరో రూ. 30,000 వసూలు చేశారని ఆయన ఆరోపించారు. అన్ని ఖర్చులు పోను ఇంకా రూ. 1.83 లక్షలు రికవరీ కావాల్సి ఉందని, ఈ నిధులు ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లాయో చెప్పే బ్యాంక్ స్టేట్‌మెంట్లు తన వద్ద ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ లెక్కలను స్పెషల్ ఆఫీసర్ ముందే సిబ్బంది అంగీకరించారని ఆయన అన్నారు.



## జనాభా లెక్కలు, సర్వే పేరుతో వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12:** ఇటీవల నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ, ప్రస్తుతం ప్రభుత్వం ప్రారంభించిన జనాభా లెక్కలు (పాపులేషన్ సెన్సస్) నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ సర్వేలు నిర్వహిస్తున్నామని చెప్పి ఇళ్లకు వెళ్లి చోరీకి పాల్పడం జరిగిందని ఈలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇళ్లలోకి ప్రవేశించే వ్యక్తులపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిజమైన ప్రభుత్వ సిబ్బంది ఎప్పుడూ అధికారిక గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు కలిగి ఉంటారని, వాటిని చూపించకుండా ఎవరినీ ఇంట్లోకి అనుమతించకూడదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పట్టణ పరిసరాల్లో ఒంటరిగా నివసించే వృద్ధులు, మహిళలు ఎక్కువగా లక్ష్యంగా మారే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులు వారికి ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం తరఫున ఎలాంటి సర్వేలు నిర్వహించినా, ముందుగా సంబంధిత శాఖలు ప్రజలకు సమాచారం అందిస్తాయని, అటువంటి అధికారిక ప్రకటనలు లేకుండా వచ్చే వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రజల అప్రమత్తతతోనే ఇలాంటి మోసాలు, చోరీలు నివారించవచ్చని, పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఎస్పీ తెలిపారు.

## పోచమ్మ పునఃప్రతిష్టలో ఎమ్మెల్యే

**కొడిమ్యాల, ఏప్రిల్ 12:** కొడిమ్యాల మండల కేంద్రంలో ఆదివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పర్యటించారు. ఈ సందర్భంగా డి-మార్ట్ సూపర్ మార్కెట్‌ను ప్రారంభించారు. అనంతరం శ్రీ లోకమాత పోచమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన పునఃప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు ఊట్కూరి నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొండూరి రాజేష్, ఉప సర్పంచ్ గుర్రం నర్సయ్య గౌడ్, నాయకులు గుడి మల్లిఖార్జున్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలువేరి నారాయణ, మాజీ ఎంపీపీ మేనేని స్వర్ణలత రాజనర్సింగరావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కదారి మల్లేశం, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో మెరిసిన 'ఆదర్శ విద్యార్థులు'



**కొడిమ్యాల, ఏప్రిల్ 12 :** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు ఆదివారం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో ద్వితీయ సంవత్సరంలో 93 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీ విభాగంలో బి. శ్రీజ 953, సాత్విక 945, బైపిసిలో తబస్సుమ్ 889, గోవర్ధన్ చారి 885, సిఇసి లో కె. శాంతి ప్రియ 734 మార్కులు సాధించారు. 29 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 27 మంది విద్యార్థులు పాసైనట్లు ప్రిన్సిపాల్ బి. లావణ్య తెలిపారు. మొదటి సంవత్సరంలో 61 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 39 మంది విద్యార్థులు పాస్ ఉత్తీర్ణులయ్యారని ఎంపీసీలో పల్లవి 412, బైపీసీలో ధరణి 384, సిఈసిలో వైశాలి 303 పొంది 63 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.



## గ్యాస్ సిలిండర్లు పేలి నలుగురికి గాయాలు.

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 12:** ఖసంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ లో మధ్యాహ్నం సుమారు మూడు గంటల సమయంలో కల్వకుంట రోడ్డు లోని ఇంటి నెంబర్ 5-1-8/1 ఒక నివాస గృహంలో ప్రమాదవశాత్తు ఎల్పిజి గ్యాస్ సిలిండర్ లికై అగ్నిప్రమాదం సంభవించింది. సిలిండర్లను డెలివరీ చేసే వ్యక్తి ఇంట్లో సిలిండర్లు పేలి ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సంగమేశ్, మల్లమ్మ, శ్రీజ, ఆమోసులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. భారీ శబ్దంతో జరిగిన ఈ పేలుడు దాటికి ఇల్లు ధ్వంసం అయింది. స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి, ఇంట్లో గ్యాస్ సిలిండర్లు ఎందుకు ఉన్నాయని దానిపై అనుమానంతో దర్యాప్తు చేస్తున్నారు.



## నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమీక్ష



**దమ్మపేట, ఏప్రిల్ 12:** దమ్మపేట మండలం, గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్ల సమీక్ష సమావేశం ఆదివారం జరిగింది. ఇటీవల నియమితులైన 184 మంది బూత్ ఏజెంట్లకు పార్టీ నూతన విధి విధానాల అమలు బాధ్యతల పై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి జిల్లా టీపీసీసీ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ నియోజకవర్గంలోని ఐదు మండలాల ముఖ్య నాయకులు అనుబంధ సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడే ప్రయత్నాలు జరుగుతున్నాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన బాధ్యత ప్రతి బూత్ ఏజెంట్‌పై ఉందని తెలిపారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతకు ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బూత్ ఏజెంట్లదేనని అన్నారు ఈ సమావేశంలో నాయకుల అభిప్రాయాలను కూడా సేకరించి పార్టీ బలోపేతానికి అవసరమైన సూచనలపై చర్చించారు.

# కామ్రేడ్ నూర్జహాన్ మరణం కార్మిక ఉద్యమానికి తీరని లోటు

- సిఐటియు కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12:** సిఐటియు నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నూర్జహాన్ (43) అనారోగ్యంతో నిజామాబాద్ పట్టణంలోని వెల్నెస్ హాస్పిటల్లో శనివారం ఊపిరితిత్తుల సమస్య, గుండెపోటుతో మృతి చెందారు. ఈరోజు తన స్వస్థలం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కార్యక్రమశీ నిర్వహించడం జరిగింది నూర్జహాన్ మరణం కార్మిక, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు. నూర్జహాన్ మృతి పట్ల సిఐటియు కామారెడ్డి జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నది. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది. ఈరోజు బాన్సువాడలో జరిగిన అంతిమ యాత్ర కార్యక్రమంలో భాగంగా పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు ఈ సందర్భంగా సిఐటి యొక్క కామారెడ్డి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ నూర్జహాన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకురాలు, జిల్లాలో బీడీ కార్మికులు, అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, గ్రామ పంచాయితీ, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ, మిషన్ భగీరథ తదితర కార్మికుల సమస్యల పరిష్కారానికై పోరాటాలు సమరశీలంగా నడిపిన మిలిటెంట్ నాయకురాలు. అన్నిరకాల కార్మికులను ఐక్యంగా సంఘటితం చేయడంలో నూర్జహాన్ పాత్ర మరువలేనిది. ఆమె కార్మిక హక్కులు, రక్షణ కోసం అనేక ఉద్యమాలు నడిపింది. నూర్జహాన్ మరణం నిజామాబాద్ జిల్లా కార్మికవర్గానికి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. నిజామాబాద్ ట్రేడ్ యూనియన్, ప్రజాతంత్ర ఉద్యమాల నిర్మాణంలో కామ్రేడ్ నూర్జహాన్ ముఖ్యమైన పాత్ర నిర్వహించారని అన్నారు నూర్జహాన్ చిన్ననాటి నుండే వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలకు ఆకర్షితురాలై అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొన్నారు. తన 8 నెలల పసిబిడ్డతో వరంగల్ సెంట్రల్ జైలులో 18 నెలల పాటు జైలు జీవితం కూడా గడిపింది. పేదలకు ఇళ్ళు, ఇండ్ల స్థలాలు కావాలని చేసిన భూ పోరాటంలో కూడా పోలీసుల కేసులు, నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా అలుపెరగని పోరాటం చేసింది. కడదాకా తాను నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు పాటు పడింది. కార్మికవర్గానికి, ప్రజా ఉద్యమాలకు ఆమె లేని లోటు తీరనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా నాయకులు వెంకట్ గౌడ్ కొత్త నరసింహులు మోతి రామ్ నాయక్ అరుణ్ రేణుక బాలమణి దొడ్లమోహన్ రవీందర్ దశరథ్ మంద శ్రీనివాస్ కర్రల సత్యం మహాదేవి గౌరీ పల్లవి మంగాదేవి రాజు కమ్మరి సాయిలు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం... జువెలరీ ఎగ్జిబిషన్‌కు ఊతం

- ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న సింధు ఆదర్శ్ రెడ్డి
- అశోక్ నగర్‌లో పీఎంజే జువెల్స్ ప్రదర్శన సందర్శన




**పటాన్చెరు, ఏప్రిల్ 12:** ప్రజల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పేర్కొన్నారు. మ్యాక్ సొసైటీ కాలనీలో కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిటిజన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో, హీూజ సొసైటీ కమిటీ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో రక్తపోటు, ర్యాండమ్ బ్లడ్ షుగర్, 2డీ ఎకో, మామోగ్రామ్, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. అలాగే కార్డియాలజీ, గైనకాలజీ ఆంకాలజీ నిపుణుల సేవలు అందించారు. కాలనీకి చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఇలాంటి శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమానికి బీహెచ్ఈఎల్ మాజీ ఈడీ ఉదయ్ కుమార్ హాజరై శిబిరాన్ని అభినందించారు. హీూజ సొసైటీ అధ్యక్షుడు సలీమ్, జనరల్ సెక్రటరీ నందగోపాల్, డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం, దుర్గారెడ్డి, నివాసులు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. ఇక రామచంద్రాపురం డివిజన్ అశోక్ నగర్‌లో నిర్వహించిన పీఎంజే జువెల్స్ ఎగ్జిబిషన్‌ను కూడా సింధు ఆదర్శ్ రెడ్డి సందర్శించారు. వివిధ రకాల ఆభరణాలను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఇటువంటి ప్రదర్శనలు స్థానిక వ్యాపారాలకు ఊతమివ్వడంలో కీలకమని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌ను స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ పాండు గౌడ్, మధులత పాల్గొన్నారు.





# కరెంట్ కార్మికులపై కనికరం లేని యాజమాన్యం

**విద్యుత్ జేఏసి భూపాలపల్లి డివిజన్ జాయింట్ సెక్రటరీ వేముల కిరణ్ గౌడ్**

**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 12:** విద్యుత్ ఆర్టిజన్, అన్మ్యాన్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8 నుండి చెప్పట్టిన సమ్మె 5 రోజులవుతున్న ఇప్పటి వరకు యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోకుండా చర్చలకు పిలువకుండా కాలయాపన చేస్తుందని విద్యుత్ జేఏసి భూపాలపల్లి డివిజన్ జాయింట్ సెక్రటరీ వేముల కిరణ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజానికి వెలుగుని పంచెందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి, విధి నిర్వాహనే ఆరాధ్య దైవంగా భావిస్తూ..రాత్రింబవళ్లు నిరంతరం శ్రమించే కరెంటోళ్ల ను పట్టించుకోకపోగా జెన్ కోలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కొంతమంది అధికారులు, యూనియన్ లీడర్లు కలిసి కార్మికులను భయభ్రాంతులకు గురిచేసి డ్యూటీ చేసే విధంగా ప్రోత్సహించడం హేయమైన చర్యన్నారు. తెలంగాణ విద్యుత్ సంస్థలోని ట్రాన్స్ కో, జెన్ కో, టిజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్, సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్, అన్ మ్యాన్డ్ కార్మికులు, 9 ట్రేడ్ యూనియన్ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడి ఉమ్మడి పోరుకు దిగారని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 19061 మంది ఆర్టిజన్లుగా సేవలందిస్తుండగా..ఆర్టిజన్ కార్మికులను ఏపీ ఏసీబీ రూల్స్ అమలు చేయాలని, అన్ మ్యాన్డ్ కార్మికుల సంస్థల విలీనం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న సెఫరెట్ కార్మికులకు జీవో 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చి 4, 5 రోజులు గడిచిన పలు దఫాలుగా నిరసన కార్యక్రమాలు తెలిపిన యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ, చర్చలకు పిలవకుండా కరెంటు కార్మికులపై కనికరం లేకుండా కాలయాపన చేస్తూ కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి నాటి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుండి ప్రారంభించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆర్టిజన్, అన్ మ్యాన్డ్ కార్మికులను కన్వర్షన్ చేస్తామని, అన్ మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి వివిధ రకాల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తూ, వేలాది విద్యుత్ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని ఆయన ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని కోరారు.



# ఇంటర్లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 12:** కామారెడ్డి కి చెందిన మున్నంఅనన్య పట్టణంలోని వి ఆర్ కె కళాశాల సంస్థల్లో ఇంటర్ చదువుతోంది ఆదివారం ఇంటర్ బోర్డ్ ప్రకటించిన ఫలితాల్లో సీఈసీ గ్రూపు నుంచి 1000 మార్కుల కు గాను 982 మార్క్స్ సాధించింది రాష్ట్రంలో మూడవ ర్యాంక్ సాధించింది రాష్ట్ర టాపర్ కు 985 మార్క్స్ వచ్చాయి ఇంటర్ ప్రథమ సంవత్సరంలోను స్టేట్ లో రెండవ ర్యాంక్ సాధించింది లక్ష్యంగా తాను సీఈసీ ను ఏంచుకొని శ్రమిస్తున్నట్లు ఈ సందర్భంగా అనన్య తెలిపింది అనన్య తండ్రి మున్నం.శ్రవణ్ కుమార్ 25 ఏల్లుగా సీనియర్ జర్నలిస్ట్ గా పని చేస్తున్నారు తల్లి మున్నం.రాధ గృహిణి తమ బిడ్డ ఇంటర్ లో అనుకున్న స్థాయిలో మార్క్ లు ర్యాంక్ ను సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు తమ కూతురు ఐఏఎస్లక్ష్యంగా కష్టపడి చదువుతొందని తన లక్ష్యం చేరుకొనేలా వెన్నంటి తోడ్పాటు నిస్తామని ఈ సందర్భంగా చెప్పారు.తమ పెద్ద కూతురు నిహారిక సైతం ఎస్సార్ కివిద్యసంస్తల్లొ చదివి ఇంటర్ ఎంపీసీలో 950 పైగా మార్క్ లు సాధించి ఎంసెట్ లో మంచి ర్యాంక్ సాధించి నల్లమల్లారెడ్డి కాలెజిలొ ఫ్రీ సీట్ సాధించి సిఎస్సిలొ ఇంటర్ సెకండ్ ఈయర్ చదువుతోంది తమ ఇద్దరు కూతుల్లు అనుకున్న లక్ష్యాల వైపు సాగుతుండడం పట్ల తల్లి తండ్రులు ఆనందం వ్యక్తం చేశారు కళాశాల యజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

### కొర్కిశాల మోడల్ స్కూల్ ప్రభంజనం

వరంగల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాలలో కొర్కిశాల మోడల్ గురుకుల కళాశాలలోని విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి..ప్రభంజనం సృష్టించారని, ఎంఈఓ లింగాల కుమారస్వామి, మోడల్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ రాకేష్ లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కొనుకటి సంజన 1000 మార్కులకు గాను 973, పొన్నాల స్వాతి 1000 మార్కులకు గాను 936, కొనకటి మౌనిక 1000 మార్కులకు గాను 924 మార్కులు సాధించారని, బైపీసీలో రూషగాని నేహ 1000 మార్కులకు గాను 959, పెంతల నికిత 1000 మార్కులకు గాను 920, అలాల యశస్వి 1000 మార్కులకు గాను 910 మార్కులు సాధించారని, సీఈసీలో తాళ్లపల్లి బావని 1000 మార్కులకు గాను 924, తాళ్లపల్లి పూజ 1000 మార్కులకు గాను 815 మార్కులు సాధించారని, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీలో బొంపల్లి అక్షిత 470 మార్కులకు గాను 396, బైపీసీలో పినగాని సిరి చందన 440 మార్కులకు గాను 375, సీఈసీలో ఎంగిలి మహేష్ 500 మార్కులకు గాను 375 మార్కులు సాధించి విజయ దుందుభి మోగించారని తెలిపారు.

# ఆలయ నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

### ఎమ్మెల్యే జిఎంఆర్



**పటాన్చెరు, ఏప్రిల్ 12:** ఆలయాలు మనసుకు శాంతిని, ఆత్మకు ఆహ్లాదాన్ని, జీవితానికి మార్గదర్శకత్వాన్ని అందించే ఆధ్యాత్మిక కేంద్రాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణానికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని నవ్య రోడ్డులో నిర్మించబడనున్న శ్రీ అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం వేద పండితుల సమక్షంలో భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యం కలిగించే కేంద్రాలుగా దేవాలయాలు నిలుస్తాయని పేర్కొన్నారు. నూతన దేవాలయం నిర్మాణానికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, సీనియర్ నాయకులు గోపాల్, ఉపేందర్ రెడ్డి, బాలరాజు, రాములు, దాసు, రుశ్వంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమీన్పూర్‌లో ఆక్రమణల తొలగింపు వేగం

### 861 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ దాదాపు పూర్తి



**పటాన్చెరు, ఏప్రిల్ 12:** అమీన్పూర్‌లో ప్రభుత్వానికి చెందిన ఖాళీ భూముల పరిరక్షణ కోసం హైడ్రా చేపట్టిన చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 861 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ పనులు దాదాపు పూర్తికావస్తున్నాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఈ ఆపరేషన్ రాత్రి వరకు కొనసాగగా, ఆదివారం ఉదయం మళ్లీ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముకీమ్ సోదరుడు అజీమ్ అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని సుమారు 90 శాతం వరకు కూల్చివేశారు. సమీపంలోని అపార్టుమెంట్లకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటుం డటంతో కూల్చివేత ప్రక్రియ కొంత సమయం తీసుకుంటోంది. అదే సమయంలో, విస్తీర్ణమైన భూమి చుట్టూ ఫెన్సింగ్ పనులు కూడా సమాంత రంగా కొనసాగుతున్నాయి. హైడ్రా అధికారులు స్వయంగా అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తు న్నారు. స్థానికులు హైడ్రా చర్యలను స్వాగతిస్తూ అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో భయాం దోళనల మధ్య జీవించామని, ఇప్పుడు హైడ్రా చర్యలతో భరోసా కలిగిందని వారు చెబుతున్నారు. తమ ఇళ్లను కూల్చబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీతో ఆందోళనలు తొలగిపోయాయని పేర్కొన్నారు. అక్రమంగా ఆక్రమించి వందల ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని భారీగా ఆర్థిక లాభాలు పొందిన వారిపై హైడ్రా కఠిన చర్యలు తీసుకోవడం అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడడంలో హైడ్రా తీసుకుంటున్న చొరవ ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని వారు తెలిపారు.





# లిటిల్ మిలీనియం నుంచి బ్లూమ్ నెస్ట్‌గా..



● సరికొత్త హంగులతో విద్యా సేవల ఆవిష్కరణ

**పటాన్చెరు, ఏప్రిల్ 12:** బీరంగూడ పరిసర ప్రాంతాల్లో గత తొమ్మిది సంవత్సరాలుగా 'లిటిల్ మిలీనియం' పేరుతో చిన్నారులకు నాణ్యమైన విద్య అందిస్తున్న విద్యాసంస్థ, ఇప్పుడు 'బ్లూమ్ నెస్ట్ ప్రీ స్కూల్ అండ్ డే కేర్'గా స్వంత బ్రాండ్‌తో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది. శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి కొల్లూరి మల్లేష్ నూతన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్. విద్య, విద్యా విభాగాధిపతి ప్రత్యూష రెడ్డి, కేంద్ర అధిపతి బి. సుధ మాట్లాడుతూ పాఠశాల నూతన విధానాలను వివరించారు. విద్యార్థులను గౌరవం, కుతూహలం, ఆత్మవిశ్వాసం, స్వేచ్ఛా స్వభావం అనే నాలుగు మూల సూత్రాలపై తీర్చిదిద్దుతామని తెలిపారు. పేరు మారినా ఉపాధ్యాయుల అంకితభావం, పిల్లలపై ప్రేమ, బోధనలో నాణ్యతలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. జాతీయ విద్యా విధానం-2020, జాతీయ పాఠ్య ప్రణాళికా రూపకల్పన-2023కు అనుగుణంగా రూపొందించిన నూతన పాఠ్య పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. చిన్నారుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తరగతుల పేర్లలో కూడా మార్పులు చేశారు. ప్లే గ్రూప్, నర్సరీలను 'బ్లూమింగ్ బడ్స్-1, 2', ఎల్‌కేజీని 'బ్లూమింగ్ వింగ్స్', యూకేజీని 'బ్లూమింగ్ ఫ్లైయర్స్'గా నామకరణం చేశారు. తల్లిదండ్రుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తూ, గత తొమ్మిదేళ్లుగా చూపిన నమ్మకాన్ని మరింత బలపరుస్తామని యాజమాన్యం తెలిపింది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సిగాచి ప్రమాదంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**మంత్రి వివేక్‌ను కోరిన మెట్టు శ్రీధర్**

**పటాన్చెరు, ఏప్రిల్ 12:** సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో చోటుచేసుకున్న ప్రమాదాలకు సంబంధించి బాధ్యులైన యాజమాన్యం మరియు సంబంధిత అధికారులపై తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం పటాన్చెరు పట్టణంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను కలిసి, 2018 నుండి 2024 వరకు జరిగిన తనిఖీ నివేదికల ఆధారంగా సమగ్ర ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిగాచి ఇండస్ట్రీస్ యాజమాన్యం గత ఏడేళ్లుగా ఫ్యాక్టరీ చట్టాలను పలుమార్లు ఉల్లంఘించిందని ఆరోపించారు. 2018-19లో అనుమతించిన 100 మంది కార్మికుల పరిమితిని మించి నియామకాలు జరిపినట్లు, అలాగే 2022లో 818 హెచ్‌పీ లైసెన్స్ పరిమితి ఉన్నప్పటికీ 1777 హెచ్‌పీ సామర్థ్యం గల యంత్రాలను అనుమతి లేకుండా ఏర్పాటు చేసి ప్రమాదాలకు దారితీసిందని వివరించారు. 2019, 2021, 2023 సంవత్సరాల్లో జరిగిన తనిఖీలలో యంత్రాలకు భద్రతా గార్డులు లేవని గుర్తించినప్పటికీ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రమాదకర రసాయనాలు ఉపయోగించే ఫ్యాక్టరీలో హాజర్డ్ అనాలిసిస్ నివేదికలు లేకపోవడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. ప్రతి ఏడాది తనిఖీల్లో లోపాలు బయటపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి విషాద ఘటనలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల మరణాలకు బాధ్యులైన యాజమాన్యంతో పాటు విధి నిర్వహణలో విఫలమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మెట్టు శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.



# వైభవంగా బ్రహ్మోత్సవాలు

**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేజ్ -2 లోని శ్రీ గంగా లలితా కామేశ్వరి సమేత శ్రీ సిద్దేశ్వరస్వామి దేవాలయం షోడశ 16వ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కోరిన కోర్కెలు సిద్ధింప చేసే దైవం సిద్దేశ్వర స్వామి అని, స్వామి వారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో ఆలయ ధర్మకర్త మురళీ, ఆలయ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**కొడిమ్యాల, ఏప్రిల్ 12:** కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ఏడపెల్లి మల్లేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మల్లేశం కుమారుడు ఏడపెల్లి బాబు స్నేహితులు 2000-2001 శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఐదవ తరగతి చదువుకున్న బాల్యమిత్రులు కలిసి మల్లేశం కుటుంబానికి 50 కిలోల బియ్యం, రూ. 4000 ఆర్థిక సహాయం అందించి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి ఏడుమల అవినాష్ మాట్లాడుతూ గత 3 సంవత్సరాల క్రితం ఏడపెల్లి బాబు మరణించగా, ఇప్పుడు వారి తండ్రి ఏడపెల్లి మల్లేశం మరణించడం చాలా బాధాకరమని అన్నారు. మూడు సంవత్సరాల వ్యవధిలో తండ్రి, కొడుకులు మరణించడంతో వారి కుటుంబం దిక్కు తోచని పరిస్థితుల్లో ఉందని తెలిపారు. భవిష్యత్తులో కూడా తమ బాల్యమిత్రుడి పిల్లల చదువుల కోసం ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవడం పట్ల స్థానికులు అభినందించారు.




# ఇంటర్మీడియట్ ఫలితాల్లో భాషిత కళాశాల ప్రభంజనం

**కుత్బుల్లాపూర్ :** ప్రభుత్వం ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఐడిపియల్ క్రాస్ రోడ్స్‌ని భాషిత జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగంలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పుతూ, స్థాపించిన తొలి ఏడాదే అనుభవజ్ఞులైన సంస్థలకు దీటుగా విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి రాష్ట్ర ఇంటర్మీడియట్ ఫలితాల్లో రికార్డు స్థాయి మార్కులతో ప్రభంజనం సృష్టించింది. ఎం.పి.సి విభాగంలో ప్రియ కేతన సాయి, ఎం. హన్విక్ 464/470 మార్కులతో స్టేట్ టాపర్లుగా నిలవగా, శిల్పిత హిమాని (463), షేక్ దియా (462), అను మేఘన రెడ్డి (461), చార్విక్ (461) అత్యుత్తమ మార్కులు సాధించారు. బై.పి.సి విభాగంలోనూ దీపికా రాజ్ (433/440), విజయ్ చౌదరి (431), బాలాజీ (428) మార్కులతో తమ మేధస్సును చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఛైర్మన్ డాక్టర్ దాయక సత్యనారాయణ, కరస్పాండెంట్ తాటిచర్ల శైలజ, డైరెక్టర్ టి. హేమలత పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తూ, ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహించడం వల్లే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు. స్టేట్ ర్యాంకులు సాధించిన టాపర్స్ తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. తమ పిల్లల విజయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో విలువైనదని యాజమాన్యం ఈ సందర్భంగా పేర్కొంది. కేవలం అకడమిక్ మార్కులే కాకుండా ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దడమే భాషిత లక్ష్యమని డైరెక్టర్ టి. హేమలత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు , సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహాన్ని జరుపుకున్నారు.

# ఈతకు వెళ్లి బాలుడి మృతి

**కామారెడ్డి, ఏప్రిల్ 12:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్ గ్రామానికి చెందిన కుర్మ రాకేష్ (15) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయి. అయితే ఆదివారం కావడంతో మరో ఇద్దరు మిత్రులతో కలిసి గొర్లు మేపడానికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఎండ తాకిడికి చెరువులో ఈత కొట్టడానికి ముగ్గురు దిగారు. ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు రాకేష్ చెరువులో ఉన్న గుంతలో ఊపిరాడక మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాకేష్ తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఇంటర్‌లో స్టేట్ సెకండ్ ర్యాంకులు

**దమ్మపేట, ఏప్రిల్ 12:** ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాల్లో దమ్మపేట మండలం, అప్పారావుపేట గ్రామంకు చెందిన శెట్టిపల్లి మోక్షిత, మొద్దులగూడెం గ్రామంకు చెందిన మల్లిశెట్టి ధన తేజస్విని లు వి.కే.డి.వి.ఎస్ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. ఆదివారం విడుదల చేసిన తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో ఇద్దరూ విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో రెండోవ ర్యాంకులు సాధించారు. శెట్టిపల్లి మోక్షిత హాల్ టికెట్ నెం. 2644107333, ఎం.పి.సి విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించింది. మల్లిశెట్టి ధన తేజస్విని హాల్ టికెట్ నెం. 2644107386, బై.పి.సి విభాగంలో 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా శెట్టిపల్లి మోక్షిత తల్లితండ్రులు తండ్రి సురేష్ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ లో ల్యాబ్ అసిస్టెంట్, తల్లి గృహిణి సుధారాణి, మల్లిశెట్టి ధన తేజస్విని తండ్రి వ్యవసాయదారుడు మల్లిశెట్టి రాంబాబు, గృహిణి సుశీల తమ కుమార్తెలనున చదువు విషయంలో కష్టపడి చదివిస్తున్నందుకు గాను కళాశాల ప్రిన్సిపాల్ వెలుగోటి శేషబాబు మరియు సిబ్బంది, బంధుమిత్రులు, గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్తులో వీరు ఇరువురు విద్యలో రాణించి దేశానికి గర్వకారణం అయ్యే స్థాయికి చేరాలి అని పలువురు ప్రశంసలు తెలియజేశారు.



శెట్టిపల్లి మోక్షిత





# పటాన్‌చెరు మార్కెట్ కమిటీ సన్మాన సభ

- మంత్రుల హామీలు - అభివృద్ధిపై కీలక ప్రకటనలు

**పటాన్‌చెరు, ఏప్రిల్ 12:** పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గానికి ఘన సన్మాన సభ అట్టహాసంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులతో మంత్రులు ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు. శివానందం చైర్మన్‌గా, రాజశేఖర్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ పటాన్‌చెరు ప్రాంత అభివృద్ధి, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన ప్రజల రుణం తీర్చుకుంటామని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కాటా శ్రీనివాస్ గౌడ్ అవుతారని చేసిన వ్యాఖ్య సభలో చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు మరిన్ని నిధులు కేటాయిస్తామని తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కొత్త కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరు–శంకర్‌పల్లి రహదారిని విస్తరించేందుకు త్వరలో శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌తో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రాంత అభివృద్ధికి దోహదం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. కమిటీ సభ్యులుగా బిక్షపతి, మైపాల్, నాగరాజు, నర్సింలు, బాలరాజ్, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, సతీష్ కుమార్ గౌడ్, ఇమ్రాన్, సునీత, హమీద్, సామయ్య, మల్లయ్య, గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సభ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతూ కోలాహలంగా సాగింది.



